# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 302 పేజీలు: 4 | వెల: రూ.4/- | ఆదివారం 28 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ప్రపంచాన్ని ఆకర్శిస్తున్న

# తెలంగాణ రైజింగ్

### నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు

### ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జూన్ 27 (నమస్తే ఉదయం):**

తమ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకా శాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. అలాగే ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షిస్తున్నాయని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు

# తేడా తెలియదా?

### బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు

### అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 27 (నమస్తే ఉదయం):**

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷సజీల। ఆనీఇ-బీప।నిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం

..మిగతా 2లో



## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్

### ధృవీకరించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో

### భారత్ -యూఎస్ బంధం బలోపేతం అంటూ కితాబు

**వాషింగ్టన్,జూన్27 (నమస్తే ఉదయం):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ భారత్ పర్యటన కోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తానని తెలిపారు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్

..మిగతా 2లో

## ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి

### ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

### తెలంగాణ హక్కలుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు

### మరోమారు విమర్శలు గుప్పించిన హరీష్ రావు




**హైదరాబాద్, జూన్ 27 (నమస్తే ఉదయం):**

ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును

..మిగతా 2లో



## గుజరాత్‌లో భారత్ టాక్సీ సేవలు

### రెండేళ్లలో 500 నగరాలకు విస్తరణ

### గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా

**గుజరాత్, జూన్ 27 (నమస్తే ఉదయం):**

రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే ఏడు లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు.

## రాష్ట్రాల అధికారాలను లాక్కునే కుట్ర



### చట్టం పేరుతో అమలు చేయాలని కేంద్రం చూస్తోంది

### 60 రోజుల ఉపాధి కాదు..

### 200 రోజుల ఉపాధి హక్కు కల్పించాలి


### జూలై 2న రాష్ట్ర కేబినెట్‌లో తుది నిర్ణయం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 27 (నమస్తే ఉదయం):**

గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వీబీ-జీ రామ్-జీ చట్టం--2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన రెండో మంత్రివర్గ ఉప సంఘం సమావేశం నిర్వహించారు. అనం తరం మంత్రి మాట్లాడుతూ.. ఇది కేవలం ఉపాధి హామీ చట్టం సవరణ కాదని, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే

..మిగతా 2లో



## నేడు పల్స్ పోలియో

### చిన్నారులకు పోలియో చుక్కలకు ఏర్పాట్లు

2

# రాష్ట్రాల అధికారాలను లాక్కునే కుట్ర



**మొదటి పేజీ తరువాయి...**

జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా కేంద్రీకరించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆయన ఆరోపించారు. "తెలం గాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్తును తాకట్టు పెట్టే చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తలవంచి అమలు చేయదు. ప్రజల ప్రయోజనాలే మాకు పరమావధి" అని ఆయన స్పష్టం చేశారు. ఈ చట్టంలోని అనేక నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు ఉపసంఘానికి వివరించారని తెలిపారు. అవసరమైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు.

"రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు అవసరమైతే దేశ అత్యున్నత న్యాయస్థానం తలుపులు తడతాం. తెలంగాణ ఒక్కటే కాదు... సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొన్నారు. కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి, ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణపై చర్చించాలని ఉపసంఘం నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని తెలిపారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమని మంత్రి విమర్శించారు.

ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినా వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని అన్నారు. "తెలంగాణ ప్రజల హక్కులు, రాష్ట్ర రాజ్యాంగబద్ధ అధికారాలు, గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడటం మా బాధ్యత. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే తెలంగాణ చూస్తూ ఊరుకోదు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. అవసరమైతే రాష్ట్ర చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టడం వంటి అన్ని ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి తెలిపారు



## ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27(నమస్తే ఉదయం)**

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ స్వేరోస్ సర్కిల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ విజయలక్ష్మి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లను సకాలంలో అందించాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. అదేవిధంగా, జిల్లాలో ఎలాంటి గుర్తింపు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యా బలోపేతం, విద్యార్థుల సంక్షేమం కోసం అధికారులు తక్షణమే స్పందించాలని స్వేరోస్ పట్టణ కమిటీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ సర్కిల్ జిల్లా అధ్యక్షుడు తరుణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీద్, ఆదిల్, హైమద్ ఖాన్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.





## వర్షాల కోసం రైతుల పూజలు

### కృష్ణా జలాలతో దేవాలయాలకు వెళ్లి అభిషేకాలు చేసిన అన్నదాతలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27 (నమస్తే ఉదయం)**

వర్షాకాలం సీజన్ ఆరంభమై దాదాపు నెల రోజులు కావొస్తున్నా వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురువాలని కోరుతూ గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు గ్రామ రైతులు శనివారం ఎద్దుల బండ్లపై ఊరేగింపుగా వచ్చి నదీ అగ్రహారంలోని కృష్ణానదిలో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిందెలలో నదీ జలాలను నింపుకొని ఎద్దుల బండ్లపై కృష్ణా జలాలను తీసుకువచ్చి డప్పు చప్పుళ్ల మధ్య దైవ నామస్మరణతో శెట్టి ఆత్మకూరులోని దేవాలయాల్లో స్వామి వారికి కృష్ణాజలాలతో అభిషేకాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ స్వామి వారి కృపతో వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.



## జర్నలిస్ట్ అక్రిడిటేషన్ కార్డు అందజేసిన సీనియర్ జర్నలిస్ట్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27(నమస్తే ఉదయం)**

తెలంగాణ ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణి చేసిన నేపథ్యంలో శనివారం గద్వాల జిల్లా కలెక్టర్, డిపీఆర్వో మంజూరు చేసిన నూతన అక్రిడిటేషన్ కార్డులను వివిధ మండలాల రిపోర్టర్ లకు అందజేశారు. ఈ నేపథ్యంలో నూతన అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులకు సీనియర్ జర్నలిస్టు చుక్క సుదర్శన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు మహబూబ్ పాష, రవిబాబు, మల్లేష్ గౌడ్, దిశ మల్లేష్, తదితరులు అందుకున్నారు.

## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్

**మొదటి పేజీ తరువాయి...**

అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ- ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మోదీ భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మార్చారని కొనియాడారు. భారత్-అమెరికా బంధం ప్రస్తుతం ఎంతో బలంగా ఉందని మార్కో రుబియో పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రుబియో మాట్లాడారు. 'వచ్చే ఏడాది ప్రారంభంలో అధ్యక్షుడు ట్రంప్, భారత్ పర్యటనకు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే మా లక్ష్యం' అని చెప్పారు. అలాగే, అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేస్తోందని వ్యాఖ్యానించారు. లాగే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని కూడా రుబియో తెలిపారు . ఈ ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల భారత్-అమెరికా ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే క్వాడ్ దేశాల నేతల సమావేశం కూడా త్వరలో నిర్వహించాలని అమెరికా ఎదురుచూస్తోందని చెప్పారు.

## నేడు పల్స్ పోలియో

**హైదరాబాద్, జూన్ 27 (నమస్తే ఉదయం):**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం పల్స్ పోలియో నిర్వహించనున్నారు. అయిదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని నవజాత శిశువులు మొదలుకుని 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా చిన్నారులకూ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జులై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగుతుంది. ఇకపోతే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇప్పటికే ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్కరు కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, , గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని, పోలియో రహిత హోదాను ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు.

## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

**మొదటి పేజీ తరువాయి...**

పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ పక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## జోగులాంబ గద్వాల జిల్లాలో 64 అంగన్వాడీ టీచర్,9 అంగన్వాడీ ఆయా మొత్తం 73 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.. జూన్ 29 నుండి జూలై 8 వరకు అంగన్వాడీ టీచర్,ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ ...

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27 (నమస్తే ఉదయం)**



జోగులాంబ గద్వాల్ జిల్లాలోని (3) ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు,గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ గద్వాల్ అర్బన్ ప్రాజెక్టులో 28 అంగన్వాడీ టీచర్ పోస్టులు,5 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 33 పోస్టులు,ఐసీడీఎస్ మల్దకల్ ప్రాజెక్టులో 22 అంగన్వాడీ టీచర్ పోస్టులు,4 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి మొత్తం 26 పోస్టులు,ఐసీడీఎస్ మానవపాడు ప్రాజెక్టులో 14 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఉన్నాయి. ఈ మూడు ప్రాజెక్టులలో కలిపి మొత్తం 64 అంగన్వాడీ టీచర్ పోస్టులు,9 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు, మొత్తం 73 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ నుంచి జూలై 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హతలు, నిబంధనలు,పోస్టుల వివరాలు మరియు దరఖాస్తు విధానం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ అయిన https://www.wdcw.tg.nic.in/ ను సందర్శించాలని సూచించారు. ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్ కు ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి

**మొదటి పేజీ తరువాయి...**

ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్‌డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ అస్సలు ఒప్పుకోదని స్పష్టం చేశారు. గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది బీఆర్ఎస్సేనని చెప్పారు. పాలమూరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతున్నారని, తాగేందుకు మంచి నీళ్లు లేక పాలమూరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చెయ్యడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తి అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రి అయిన రేవంత్ రెడ్డి, తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావొద్దని హరీష్ రావు హితవు పలికారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆంధ్రప్రదేశ్ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోందని, కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తే లేదని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

## పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం నాయకత్వంలో నెరవేరినది

### గట్టు మండలంలో అంతం పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే





**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27(నమస్తే ఉదయం)**

గద్వాల నియోజకవర్గం గట్టు మండలం అంతం పల్లిగ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. శనివారం గట్టు మండలం పరిధిలో అంతం పల్లి గ్రామంలో గోవిందమ్మ సవారీ కు మంజూరు కావడం జరిగినది. నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు .ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం గట్టు మండలం పరిధిలో అంతంపల్లి గ్రామ సర్పంచ్ శంకరమ్మ దానయ్య వారి నూతన గృహప్రవేశం లిఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిహాజరై సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకొని స్వామివారి ఆశీస్సులను పొందడం జరిగింది. ఇంటి యజమాని సర్పంచ్ కి ఎమ్మెల్యే కానుకను అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ చాగదోన సర్పంచ్ వీరేష్ నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ దుబ్బా హనుమంతు వేమారెడ్డి రామిరెడ్డి నర్సింలు ఆంజనేయులు తిమ్మప్ప నరసింహులు, జయరాం గౌడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారిని నమ్మించి మోసగించిన వ్యక్తి అరెస్ట్

## రూ. 7లక్షల నగదు, కారు స్వాధీనం

**బుద్వేల్, జూన్ 27 (నమస్తే ఉదయం):**

స్క్రాఫ్ ను కొనుగోలు చేస్తామని నమ్మించి ఓ వ్యాపారి ని మోసం చేసిన కేసులో మైలార్దేవుపల్లి పోలీసులు ఓ వ్యక్తి ని అరెస్ట్ చేశారు. ఎస్ఐ జయలక్ష్మి తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... కర్ణాటక కు చెందిన సయ్యద్ సోహెల్ (40), మే 17న కాటేదాన్ పారిశ్రామిక వాడ కు వచ్చాడు. కాటేదాన్ లో సుల్తాన్ పటేల్ కు చెందిన గోదాము లో అల్యూమినియం స్క్రాప్ ను గుర్తిం చి తనకు తెలిసిన అబ్దుల్ వహీద్ తో కలసి మోసం చేసేందుకు పథకం రచించాడు. సుల్తాన్ పటేల్ తో నీ అల్యూమినియం స్క్రాప్ ను కొనుగోలు చేస్తామని నమ్మిస్తారు. ఈ విషయాన్ని బహదూరుర కు చెందిన మరో అల్యూమినియం స్క్రాప్ వ్యాపారం చేసే మహ్మద్ యాసర్ పటేల్ కు చెప్పారు. పెద్ద మొత్తం లో పాత అల్యూమినియం స్క్రాప్ అందుబాటులో ఉందని నమ్మించారు. మే 19న మహ్మద్ యాసర్ పటేల్ ను తీసుకుని స్క్రాప్ కొనుగోలు నిమిత్తం కాటేదాన్ స్క్రాప్ దుకాణానికి వచ్చారు. స్క్రాప్ ను వాహనాలలో లోడ్



సయ్యద్ సోహెల్ ను అరెస్ట్ చేసి కారు ను సీజ్ చేసిన ఎస్ ఐ జయలక్ష్మి

చేస్తుండగా సయ్యద్ సోహెల్ అడ్వాన్స్ రూ.10 లక్షల నగదు ఇవ్వాలని, బ్యాం కులో డిపాజిట్ చేయాలని చెప్పి యాసిర్ పటేల్ తో డబ్బులు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రూ.10లక్షలలో నుంచి కొంత మొత్తాన్ని అబ్దుల్ వహిద్ కు ఇచ్చాడు. కొంత సేపటి తర్వాత యాసర్ పటేల్ సోహెల్ కు ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయానని గుర్తించిన యాసిర్ పటేల్


నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మైలార్దేవుపల్లి పోలీసులను ఆశ్రయించాడు. డబ్బులు పోగా అల్యూమినియం స్క్రాప్ కూడా దక్కక పోవడంతో ఆయన పోలీసులను సంప్రదించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సయ్యద్ సోహెల్ ను అరెస్ట్ చేశారు. అబ్దుల్ వహీద్ పరారీలో ఉన్నాడు. సోహెల్ నుంచి రూ. 7లక్షల నగదు, ఆరు సిమ్ కార్డులు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక కారు ను స్వాధీనం చేసుకున్నారు.


బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తదితరులు

## బీజేపీ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

**బుద్వేల్, జూన్ 27 (నమస్తే ఉదయం)**

శంషాబాద్ లో నూతనంగా నిర్మించిన బీజేపీ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆదివారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ రానున్న నేపథ్యం లో శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పం తంగి రాజ్ భూపాల్ గౌడ్ తో రాజేంద్రనగర్ కు చెందిన మాజీ కార్పొరేటర్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్రెడ్డి పాల్గొన్నారు. ఏర్పాట్లను ఘనంగా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆం దుకోసం పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులందరు తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాజేం ద్రనగర్, చేవెళ్ల, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.



కాటేదాన్ లోని ఇందిరమ్మ క్యాంటీన్ వద్ద అల్పాహారం తీసుకుంటున్న టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్

## ఇందిరమ్మ క్యాంటీన్‌ల వద్ద షెడ్లు ఏర్పాటు చేయాలి:

**ఉస్కెమూరి విజయ్ కుమార్**

**బుద్వేల్, జూన్ 27 (నమస్తే ఉదయం)**

కాటేదాన్ ఇందిరమ్మ క్యాంటీన్ తో పాటు ఆరాంఘర్, హైదరోర్లీడ ప్రాంతాలలో ఉన్న ఇందిరమ్మ క్యాంటీన్ ల వద్ద షెడ్డు ఏర్పాటు చేయాలని టీడీపీ రాజేం ద్రనగర్ సర్కిల్ నాయకులు ఉస్కెమూరి విజయ్ కుమార్ కోరారు. శనివారం కాటేదాన్ ఇందిరమ్మ క్యాం టీన్ వద్ద ఆయన అల్పాహారాన్ని తీసుకున్నారు. అంతా బాగానే ఉన్నప్పటికి వర్షం వస్తే అల్పాహారం తో పాటు మద్యాహ్న భోజనం చేసే వారికి ఇబ్బందిగా ఉందన్నారు. వర్షాకాలంలో భోజనం చేసే వారికి ఇబ్బం దులు ఉండకుండ ఉండాలంటే ఇందిరమ్మ క్యాంటీన్ వద్ద షెడ్లు ఏర్పాటు చేసి వర్షానికి ఎలాంటి ఇబ్బం దులు లేకుండ చూడాలన్నారు. ఈ విషయంలో అధికారులు వెంటనే చొరవ తీసుకుని న్యాయం చేయాలన్నారు.



## బీజేపీ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి


**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జూన్27(నమస్తే ఉదయం)**

రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పార్టీ కార్యాలయ ప్రాంగణాన్ని ఆయన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు,చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిలతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా స్వాగత కార్యక్రమాలు,పూజా,హోమం, సుందరీకరణ, అలంకరణను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ హాజరు కానున్నారన్నారు.ఈ మేరకు అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరుగుతుందని వివరించారు.నూతన రంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం నియోజక వర్గంలో రూపుదిద్దుకొని ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందని వివరించారు.ఈ మేరకు విచ్చేస్తున్న బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కు పెద్ద ఎత్తున్న నియోజకవర్గం నుంచి కార్యకర్తలు,నాయకులు,అభిమానులు పెద్ద ఎత్తున్న తరలివెళ్లి ఘన స్వాగతం పలుకాలని పిలుపునిచ్చారు.అనంతరం నాంపల్లిలో నిర్వహించే ముఖాముఖి సభకు బీఎల్ఏలు అందరూ చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి

**బుద్వేల్, జూన్ 27 (నమస్తే ఉదయం)**



డెకరేటర్స్ గోదాము ఉన్న ప్రాంతంలోకి రాత్రి వేళ వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందాడు. పలు అనుమానాలకు తావిస్తున్న ఈ సంఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలు ఇన్స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం ఈ విదంగా ఉన్నాయి... మైలార్దేవుపల్లి పల్లె చెరువు ప్రాంతంలో ఉన్న స్వస్తిక్ శివ డెకరేటర్స్ గోదాము లోకి ఈ నెల 24న గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో ప్రవేశించాడు. అతన్ని గమనించిన గోదాము లో పనిచేసే కార్మికులు బాలాజీ (39), నాయన్ (23), ఉత్తమ్ బీర (35), ప్రేమ్ పరివార్ (26) లు దొంగ అనుకుని పట్టుకుని ఎందుకు గోదాము లోకి వచ్చావు అని ప్రశ్నించారు. దానికి మద్యం మత్తులో ఉన్న వ్యక్తి సరైన సమాదానం చెప్పలేకపోయాడు. కార్మికులు అతన్ని కొట్టి గోదాము లో బందించారు. కార్మికులు కొట్టిన దెబ్బలకు ఆ వ్యక్తి మరణించాడు. ఆ తర్వాత సమాచారం అందుకున్న మైలార్దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



## సులేమాన్‌నగర్‌లో ఎస్ఐఆర్ దరఖాస్తుల పంపిణీ

**రాజేంద్రనగర్,జూన్27(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని సులేమాన్ నగర్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ జహీరుద్దీన్ అన్నారు.శనివారం డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్-మహ్మూద్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో భాగంగా మహమ్మద్ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో పార్టీ బీఎల్ఏగా బూత్ నెంబర్లు 323,324,325 పరిధిలోని ఇంద్రానగర్, మహ్మూద్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి బీఎల్ఓలతో కలిసి ఎస్ఐఆర్ ఫారమ్ లను ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రజలకు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ,అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని,ప్రతి అర్హుడైన ఓటరు ఓటరు జాబితాలో కొనసాగేందుకు ప్రజలు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని మహమ్మద్ జహీరుద్దీన్ పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు,నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## కోట్లు వెచ్చించినా పేదలకు కనీస గూడు కరువు

**ఉప్పమూరి విజయకుమార్ ఆవేదన**

**రాజేంద్రనగర్,జూన్27(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ ఇంద్రమ్మ క్యాంటీన్ వద్ద పేదలు,కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నాయకుడు ఉప్పమూరి విజయకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.కాటేదాన్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో వేలాది మంది కార్మికులు ప్రతిరోజు ఇంద్రమ్మ క్యాంటీన్‌లో భోజనం చేస్తున్నప్పటికీ,కూర్చొని భోజనం చేయడానికి సరైన షెడ్డు లేదా నీడ లేక ఎండలు,వర్షాల సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.కోట్ల రూపాయలు ఖర్చు చేసి క్యాంటీన్లు ఏర్పాటు చేసినా,ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించకపోవడం విచారకరమని అన్నారు.అధికారులు ఈ సమస్యను చూసీ చూడనట్లు వ్యవహరించడం బాధాకరమని విమర్శించారు.అదేవిధంగా లక్ష్మీగూడ,ఆర్‌జీకే,వాంబే కాలనీ ప్రాంతాల్లో కూడా ఇంద్రమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు చాలా కాలంగా కోరుతున్నారని పేర్కొన్నారు.వెంటనే స్పందించి వాంబే కాలనీ సమీపంలో మరో ఇంద్రమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో పాటు,కాటేదాన్ ఇంద్రమ్మ క్యాంటీన్ వద్ద శాశ్వత షెడ్డు నిర్మించి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని,సంబంధిత అధికారులను ఆయన డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**గోల్కొండ,గోషామహల్ జిల్లా ఇన్చార్జ్ వై.శ్రీధర్**

**రాజేంద్రనగర్,జూన్27(నమస్తే ఉదయం)**



ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోల్కొండ,గోషామహల్ జిల్లా ఇన్చార్జ్ వై.శ్రీధర్ అన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..ఎగ్జిబిషన్ గ్రౌండ్ నాంపల్లిలో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ బిఎల్ఎ టు బూత్ అధ్యక్షులు ఆపై స్థాయి వారితో సమావేశం ఉండనుందని అన్నారు.దాదాపు గ్రేటర్ హైదరాబాద్ లో ఉన్న 300 డివిజన్లతో ఎస్ఐఆర్ గురించి ప్రస్తుతం రాష్ట్రంలో జాతీయ ఎన్నికల కమిషనర్ నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ పై ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ రాబోయే ఎన్నికలపై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడడానికి వస్తున్నారని వివరించారు.జాతీయ అధ్యక్షులకు శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో ఘన స్వాగతం పలుకుతూ తర్వాత రంగారెడ్డి జిల్లా రూరల్ కార్యాలయాన్ని ప్రారంభించి మూడు గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్లో 15 వేల మంది కార్యకర్తలతో మాట్లాడేందుకు రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ ను కైవసం చేసుకోవడానికి స్వయంగా జాతీయ అధ్యక్షులు మన ముందుకు వస్తున్నారని వెల్లడించారు.ఈ పర్యటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని,రాబోయే తెలంగాణ అధికారమే లక్ష్యంగా పోరాటానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలనే సంకల్ప నినాదం అన్నారు.ఇది కేవలం గ్రేటర్ నగరానికి మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదు.తెలంగాణ మొత్తం రాజకీయ భవిష్యత్తుకు ఇది నందని తెలిపారు.ఇక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ బలోపేతానికి కొత్త దిశ నిర్ణయించ బడుతుంది.తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే.జీహెచ్ఎంసీలో కూడాబీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మజ్లిస్,కాంగ్రెస్,బీఆర్ఎస్,లు కలిసిన తమ పార్టీ గెలుపును అడుకోలేవన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నేడు రాజేంద్రనగర్, గగన్ పహాడ్‌లో విద్యుత్ సరఫరాల అంతరాయం

**రాజేంద్రనగర్, జూన్ 27(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ ఆపరేషన్స్ సెక్షన్ పరిధిలో ఐ సి ఏ ఆర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్లపై చెట్లను నరకడం , లైన్లను బలోపేతం చేయడం వంటి షెడ్యూల్డ్ నిర్వహణ పనులను చేపట్టడం కోసం ఆదివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

**ఐ సి ఎం విద్యుత్ ఫీడర్ పరిధిలో**

ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:00 వరకు ఐ సీఎం , రాజేంద్రనగర్, దళిత బస్తీ, గాంధీ నగర్, చుట్టుపక్కల ప్రాంతాలు , నారం విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 వరకు జయశంకర్, నారం , మేనేజ్, టైప్-1 క్వార్టర్స్, రాజేంద్రనగర్, చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా



నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**గగన్ పహాడ్ లో...**

గగన్‌పహాడ్ సెక్షన్‌లో చెట్లు నరకడం నిమిత్తం, 33/11 కేవీ గగన్‌పహాడ్ సబ్-స్టేషన్‌కు చెందిన ఈ క్రింది ఫీడర్లపై విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంద ని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్ష వర్ధన్ తెలిపారు. శనివారం ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, గగన్‌పహాడ్ సబ్-స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ గగన్‌పహాడ్ ఫీడర్ మరియు 11 కేవీ సతమ్రాయ్ విలేజ్ ఫీడర్ పరిధిలో గ్రీన్ సిటీ, జల్పల్లి, శివాజీ నగర్, సతమ్రాయ్ విలేజ్, బలహీన వర్గాల కాలనీ, పసంబండ ప్రాంతా లు,మధ్యాహ్నం 14:30 గంటల నుండి. సాయంత్రం 5 గంటల వరకు గగన్‌పహాడ్ సబ్-స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ గోల్డ్ డ్రాప్ ఫీడర్ సాయి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బలహీన వర్గాల కాలనీ, బసిరెడ్డి కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల అసిస్టెంట్ ఇంజనీర్లు కోరారు.

# వానల్లేవు.. ప్రాజెక్టుల్లో నీళ్లు ల్లేవు


## 'అన్-రిజర్వ్‌డ్' జలాలతో అయోమయంలో పాలమూరు రైతాంగం


**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27 (నమస్తే ఉదయం)**

మృగశిర కార్తె దాటి, ఆరుద్ర కార్తె వచ్చినా నెలరోజులుగా వర్షాల జాడ లేకపోవడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడింది. "ఏరు ముందు సాగాలా.. యేరువాక ముందు అనే నానుడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొనసాగుతోంది. ఏరువాక పండగ వచ్చే వచ్చింది కాని రుతుపవనాల జాడ మాత్రం కనిపించకపోవడంతో ఎవుసం పండుగనా? దండగనా? అన్నట్టుగా జిల్లా రైతాంగం కొట్టుమిట్టాడుతోంది. ఎల్ నినో ప్రభావంతో దేశంలో నైరుతి రుతుపవనాలు బలహీనపడటంతో జూన్ నెల ముగిసిన కూడా వర్షపాతం నమోదు కాలేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీరందించే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వరద ప్రవాహం లేక పూర్తిగా వెలవెలబోతోంది.

**రిజర్వాయర్లలో.. 'అన్-రిజర్వ్‌డ్' జలవనరులు**

జూరాల ప్రాజెక్టుల మీద ఆదారపడి ఉన్న ధరూర్ మండలంలోని నెట్టెంపాడు, ర్యాలంపాడు రిజర్వాయర్లు ఉన్నప్పటికీ అవి పటిష్టంగా లేకపోవడం, నీటి నిల్వ భద్రత కరువవ్వడంతో జిల్లాలోని రిజర్వాయర్లన్నీ కేవలం "అన్-రిజర్వ్‌డ్ వాటర్ సోర్స్" (భద్రత లేని నీటి వనరులు) లా మారిపోయాయి. చేతిలో నీటి గ్యారెంటీ లేని ఈ అస్థిరమైన నీటి లభ్యతను నమ్ముకుని ఎంత వ్యవసాయం చేయాలి, ఎంత పంట వేయాలి అని రైతులు తీవ్ర అయోమయ





స్థితిలో ఆందోళన చెందుతున్నారు. జూరాల నుంచి కాలువలకు నీటి విడుదలపై నమ్మకం లేకపోవడంతో సాగు ప్రణాళికలన్నీ ప్రశ్నార్థకంగా మారాయి.


**పడిపోతున్న జూరాల ప్రాజెక్టు నీటి నిల్వలు:**

తెలంగాణలో కృష్ణమ్మ ప్రవేశించే తొలి ప్రాజెక్టు అయిన జూరాలకు ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ఎలాంటి వరద దరిచేరలేదు. వానాకాలం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు జూరాలకు కేవలం 68,887 క్యూసెక్కుల వరద నీళ్లు మాత్రమే వచ్చాయి. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరగడంతో పాటు ఎగువఉన్న నారాయణపూర్, ఆల్మట్టి డ్యాం ల నుంచి కృష్ణమ్మ వరద ప్రవాహం పెరగడంతో జూరాల డ్యాం గేట్లు తెరిచి దిగువకు నీటి విడుదల చేశారు. దానికి తోడు జూరాల మీద ఆదారపడి ఉన్న నెట్టెంపాడు, ర్యాలంపాడు, కోయిల్ సాగర్ లతో పాటు కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల వదిలారు. ఈ యేడు వర్షాలు లేక ఎగువన ఉన్న కర్ణాటక జలాశయాల నుంచి వరద ప్రవాహం రాకపోవడంతో జూరాలలో నీటి నిల్వలు గణనీయంగా పడిపోతున్నాయి.

**కాలువకు సాగునీరందక - రైతుల ఆవేదన:**

జూరాల ప్రాజెక్టు పరిధిలోని కుడి ఎడమ కాలువల కింద సుమారు 1,20,000 ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. సాధారణంగా ఆరుద్ర కార్తె నాటికే వరినార్లు పోసుకోవాల్సిన రైతులు, ఈసారి నార్ల జోలికే వెళ్లలేదు. కాలువలపై నమ్మకం లేక కేవలం బోరుబావులు, బావుల కింద మాత్రమే అరకొరగా నార్లు పోశారు. అయితే, వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో వేసిన నార్లు సైతం ఎండిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

"నీళ్లొస్తేనే పంట.. లేకపోతే అంతా బీడే" అంటూ ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం ఎగువ నుంచి వచ్చే వరద కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తోంది.



# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

## పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### బీరంగూడ మారుతి నగర్ కాలనీలో ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**పటాన్ చెరు, జూన్ 27( నమస్తే ఉదయం):**

పటాన్ చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ, ధ్వజ స్తంభం ప్రతిష్టాపనల కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బొల్లారంలో ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, జూన్ 27( నమస్తే ఉదయం):**

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బొల్లారం డివిజన్ వార్డు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం సహాయక గ్రూపు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిర మహిళా శక్తి చీరలను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతిలో స్వయం సహాయక సంఘాలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలతో మరింత అభివృద్ధి చెందాలని మహిళలకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఫాదర్స్ డేలో పాల్గొన్న చిన్నారులు, వారి తండ్రులు



# సంగారెడ్డిలో జూలై 9న వర్కింగ్ జర్నలిస్టుల మహాసభ !

## జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి, విష్ణు

**పటాన్ చెరు, జూన్ 27 (నమస్తే ఉదయం):**

సంగారెడ్డి జిల్లా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజే ఐజేయు) మహాసభ వచ్చే నెల 9వ తేదీన సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా అర్హులైన వారికి ఇంటి స్థలం తో పాటు హెల్త్ కార్డును ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని ఎప్పటినుంచో కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ, జర్నలిస్టులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. అంతేకాకుండా మిగిలిన వారందరికీ కూడా అక్రిడేషన్ కార్డులను జారీ చేయాల్సిందిగా తమ సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నామని వివరించారు. ఈ సమస్యలన్నింటిపై చర్చించడానికి జిల్లా మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. జూలై 9న ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్ తో పాటు సంఘం రాష్ట్ర నేతలు పాల్గొంటారని చెప్పారు.జిల్లా మంత్రి తో పాటు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరవుతారని వివరించారు. అందువల్ల జిల్లాలోని జర్నలిస్టులంతా ఈ మహాసభకు తరలి కావాల్సిందిగా కోరారు. జర్నలిస్టుల ఐక్యతను చాటి చెప్పేందుకు సువర్ణ అవకాశమని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా శాఖ నూతన కమిటీ ఎన్నిక కూడా ఆ రోజు నిర్వహిస్తామని తెలిపారు. అందువల్ల ప్రతి జర్నలిస్టు మహాసభకు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# పుంజుకుంటున్న నైరుతి రుతుపవనాలు

## చురకుగా కదులుతున్నాయన్న వాతావరణ శాఖ

**హైదరాబాద్,జూన్ 27 (నమస్తే ఉదయం)**

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది. వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం.. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేశారు. వీటితోపాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షసూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీచేసింది. జూలై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. ఇవాళ మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.





# నేడు 1,688 పోలియో బూత్‌లలో 4,20,911 మంది చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ

## రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ ఓ డాక్టర్ స్వర్ణ కుమారి

**బుద్వేల్, జూన్ 27 ( నమస్తే ఉదయం)**

ఈ నెల 28న రంగారెడ్డి జిల్లాలలోని 1,688 పోలియో బూత్ లలో పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల వరకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ స్వర్ణ కుమారి ఓ ప్రకటన లో తెలిపారు. పట్టణ ప్రాంతాలలో 493, గ్రామీణ ప్రాంతాలలో 1,195 పోలియో బూత్ లలో 4,20,911 మంది చిన్నారులకు పోలియో చుక్కలను పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. 481 హై రిస్క్ ప్రాంతాలలో నివసిస్తున్న 6,213 మంది ఐదేళ్ల లోపు చిన్నారులకు ప్రత్యేక బృం దాల ద్వారా పోలియో చుక్కలు వేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి చిన్నారుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు.





# బీఆర్ఎస్ నాయకుడు కోరని అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**రాజేంద్రనగర్,జూన్2(నమస్తే ఉదయం)**

బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కోరని అశోక్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులతో పాటు ముఖ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అందులో భాగంగా మాజీ మంత్రి,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు,మాజీ మంత్రి టి.హరీష్ రావు,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ పి.కార్తీక్ రెడ్డిలు కోరని అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ వారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం అశోక్ మాట్లాడుతూ..తన పుట్టిన రోజును పురస్కరించుకొని తనకు కేటీఆర్,హరీష్‌రావు,సబితా ఇంద్రారెడ్డి,కార్తీక్ రెడ్డిలు శుభాకాంక్షలు తెలుపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# పిల్లల జీవితంలో తొలి హీరో నాన్న..

## సోలి టైర్ గ్లోబల్ స్కూల్లో ఘనంగా సూపర్ ఫాదర్స్ డే దినోత్సవం

**బుద్వేల్, జూన్ 27 (నమస్తే ఉదయం) :**

సోలి టైర్ గ్లోబల్ స్కూల్లో సూపర్ ఫాదర్స్ డే దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే తమ పిల్లలతో కలిసి పాఠశాలకు చేరుకున్న తండ్రులు తమ పిల్లలతో కలిసి ఆడి పాడారు. "తూ మేర దిల్ తూ మేర జాన్ ఐ లవ్ యు డాడీ" పాటకు విద్యార్థులు తల్లిదండ్రులు చేసిన డాన్స్ ఉర్రూతలూగించింది. విద్యార్థుల తండ్రులకు ఉపాధ్యాయులు వివిధ క్రీడ పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అనిల్ వసంత్ మాట్లాడుతూ... కుటుంబానికి వెన్నెముకగా నిలిచే నాన్నకు ప్రేమను, కృతజ్ఞతను తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. నాన్న కేవలం తండ్రి మాత్రమే కాదు, జీవితాంతం తోడుండే ఒక మంచి స్నేహితుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత తివారి, లలిత, వైష్ణవి, సింఫోనీ, దేవి శ్రీ ప్రసాద్, రేష్మ, మౌనిక, అర్జున్, మల్లేష్, విశాల్, సనా, ఉజ్మా తదితరులు పాల్గొన్నారు.




ఫాదర్స్ డేలో పాల్గొన్న చిన్నారులు, వారి తండ్రులు